క్లుప్తంగా

నేడు కీరమందలో గడప గడపకు..

బంగారుపాళెం: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని కీరమంద గ్రామ సచివాలయం పరిధిలో ఎమ్మెల్యే ఎంఎస్ బాబు పర్యటించనున్నట్లు మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి తెలిపారు. కామాక్షిపురం, వేపనపల్లె గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించి, ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించనున్నట్లు చెప్పారు. ఉదయం 9 గంటల కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

జిల్లాస్థాయిలో కాశిరాళ్ల విద్యార్థుల ప్రతిభ



విశేష ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

యాదమరి: మండలంలోని కాశిరాళ్ల ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా వైద్యశాఖ నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచారు. ఆదివారం చిత్తూరులో జిల్లా వైద్య శాఖ నిర్వహించి సేవ్ గర్ల్ చైల్డ్ అనే విషయంపై డ్రాయింగ్, వ్యాసరచన వక్తృత్వపు పోటీలు నిర్వహించిన పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచారు. ఈ విషయమైన యాదమరి ఎంఈఓ రుక్మిణి, ఉపాధ్యాయులు అభినందించారు.

టీచర్ల సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయి శ్రీనివాస్

చిత్తూరు కలెక్టరేట్ : టీచర్ల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయిశ్రీనివాస్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఎస్టీయూ జిల్లా వార్షిక కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సెకండరీ గ్రేడ్ టీచర్లు తీవ్ర పని ఒత్తిడితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. డీఎస్సీ నియామకాలను వెంటనే చేపట్టాలని, సీపీఎస్ రద్దు చేయాలని కోరారు. సమావేశంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు దేవరాజులురెడ్డి, సీనియర్ నాయకులు బాలచంద్రారెడ్డి, రాష్ట్ర నాయకులు గంటామోహన్, పురుషోత్తం, లోకనాథరెడ్డి, ఉపాధ్యాయ వాణి పత్రికా సంపాదకులు గాజుల నాగేశ్వర రావు పాల్గొన్నారు.

గిడుగు రామ్మూర్తికి నివాళి



గిడుగు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రచయితలు

పలమనేరు : పట్టణ సమీపంలోని కళామందిరంలో ఆదివారం తెలుగు వ్యవహారిక భాష ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసీనాథంనాయుడు మాట్లాడుతూ గిడుగు రామమూర్తి స్ఫూర్తితో భాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత తెలుగువారిపై ఉందన్నారు. ఆంగ్లం మోజులో పడి మాతృభాషను మరవకూడదని సూచించారు. అమ్మభాష అవసరాన్ని తల్లిదండ్రులు గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో రచయితలు మాధవరెడ్డి, జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి, చిరంజీవి, శివశంకర్‌రెడ్డి, పుష్ప, నీలిమ పాల్గొన్నారు.

180 మందికి కంటి పరీక్షలు



వృద్ధుల కళ్లను పరీక్షిస్తున్న వైద్యులు

కుప్పం : పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో సాయిమాత సేవా ట్రస్ట్ వారు ఏర్పాటు చేసిన కంటి వైద్యశిబిరంలో 180 మందికి పరీక్షలు నిర్వహించారు. బెంగళూరుకు చెందిన శారదా కంటి ఆస్పత్రి వైద్యులు రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. 39 మందికి శస్త్రచికిత్స అవసరమని గుర్తించారు. వారికి సోమవారం ఉచితంగా ఆపరేషన్ చేయించనున్నట్లు ట్రస్ట్ వ్యవస్థాపకుడు జగదీష్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు గిరీష్, మహదేవ్ పాల్గొన్నారు.

ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం

- సీఎం జగనన్న పాలనలో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు
- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



గుడిపాల: మహిళలకు సంక్షేమ బావుటా బుక్‌లెట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

గుడిపాల: పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదర్శ పాలన సాగిస్తూ పేదల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. ఆదివారం గుడిపాల మండలంలోని మొగరాళ్లపల్లె పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న పేదల అభ్యున్నతి కోసం నవరత్నాలు అమలు చేస్తున్నారని, దీంతో వారి జీవన ప్రమాణాలు ఇప్పుడిప్పుడే మెరుగు పడుతున్నాయని తెలిపారు. వారు ఉన్నత స్థితికి చేరుకునే రోజులు దగ్గర పడ్డాయని, అందుకు జగనన్నపై మీ ప్రేమను మరింత కొనసాగించాలని కోరారు. సంక్షేమ పథకాలతో ప్రతిపక్షాల నాయకులు, కార్యకర్తలు లబ్ధి పొందుతున్నారని తెలిపారు. జగనన్న పాలనలో ప్రజలంతా మెరుగైన జీవనం సాగిస్తున్నా.. పచ్చ మీడియా మాత్రం దుష్ప్రచారాలతో సంక్షేమ పాలనపై అక్కసు వెళ్లగక్కడం శోచనీయమన్నారు. ప్రతిపక్ష నాయకుల ఉనికి కోసం అసత్య ప్రచారానికి పూనుకోవడం దుర్మార్గమన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయడంలో తమ ప్రభుత్వం ముందంజలో ఉందన్నారు. సంక్షేమ పథకాలే కాకుండా గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు. గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్‌స్తంభాల ఏర్పాటు, గ్రామ సచివాలయాలు, వివిధ కార్యాలయాల భవనాలు నిర్మించి అందుబాటులోకి తెచ్చామని వివరించారు. గత మూడున్నరేళ్లలో 95 శాతానికిపైగా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఈ ప్రభుత్వం అమలు చేసిందన్నారు. ప్రజలు మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా ఆయన పలువురు లబ్ధిదారులతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్న తీరుపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం వలంటీర్ల సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య, ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, పార్టీ కన్వీనర్ జనార్దన్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్ రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, నాయకులు సోఫియాగ్లోరీ, రజినీకాంత్, యోవాన్, సుధాకర్ నాయుడు, మొగిలిరెడ్డి, చల్లాముత్తు, కోలాకిరణ్, విక్టర్, ఫ్రాంక్లిన్, లారెన్స్, థామస్, ఏసయ్య, శ్యామ్, వెంకటేష్‌రెడ్డి, శిలంబరసన్, సాయి, కృష్ణారెడ్డి, కారు మేఘన్, చిట్టి, సంపత్, రమణ, రవి, రఘు, కృష్ణ, సురేష్, అధికారులు పాల్గొన్నారు.

నేడు కలెక్టర్ కార్యాలయంలో స్పందన

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజల సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ హరినారాయణ్ తెలిపారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో తెలియజేసి పరిష్కరించుకోవాలన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా శాఖల జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. గైర్హాజరయ్యే వారిపై శాఖాపరంగా కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో..

చిత్తూరు అర్బన్ : చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహించనున్నట్లు కమిషనర్ జె.అరుణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి స్పందన జరుగుతుందని, ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే నగరంలోని 50 డివిజన్లలో ఉన్న వార్డు సచివాలయ కార్యాలయాల్లో సాయంత్రం 3–5 గంటల మధ్యలో స్పందన జరుగుతుందన్నారు. స్థానికంగా ఉన్న ప్రజలు ఆయా సచివాలయాల్లో వినతులు అందజేయవచ్చన్నారు. ఇక ప్రజలు ఇంటినుంచే కార్పొరేషన్ కాల్ సెంటర్ 08572232745, వాట్సాప్–9849907885 నంబర్లకు ఫోన్ చేసి సమస్యలు తెలియజేయవచ్చన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో..

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పార్వతి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరుగుతుందన్నారు. ఇందులో ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. ఫిర్యాదుదారులు తప్పనిసరిగా ఆధార్, సమస్యకు సంబంధించిన పత్రాలు జత చేయాలని ఆమె పేర్కొన్నారు.

త్రైతసిద్ధాంతంపై విస్తృత ప్రచారం



మడవనేరిలో త్రైతసిద్ధాంతంపై ప్రచారం చేస్తున్న ప్రబోధ సేవాసమితి సభ్యులు

తవణంపల్లె: యోగి వేమన జయంతిని పురస్కరించుకుని నిగూఢ తత్వార్థ బోధిని గ్రంథాలపై గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఆదివారం మండలంలోని మడవనేరిలో త్రైత సిద్ధాంత ఆదికర్త ప్రబోధానంద యోగీశ్వరుల దివ్య ఆశీస్సులతో గ్రామాల్లో ఆధ్యాత్మిక గ్రంథాలపై ప్రజలకు తెలియజేశారు. ఇంటింటికి తిరిగి ఆత్మజ్ఞానుల గురించి వివరించారు. భగవద్గీత అనుబంధ గ్రంథాలపై ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి అధ్యక్షుడు ధనుంజయుడు, సభ్యులు ఛటర్జీ, కిరణ్, హర్షవర్ధన్, విమలమ్మ, లత, మంజుల, రెడ్డిజ్ఞానావతి, రేఖకల్యాణి పాల్గొన్నారు.

సంఘం బలోపేతానికి కృషి చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శివయ్య

చిత్తూరు కలెక్టరేట్ : సంఘం బలోపేతానికి కృషి చేయాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శివయ్య అన్నారు. ఆదివారం స్థానికంగా ఉన్న ఆ సంఘం కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి సంఘం నిత్యం కృషి చేస్తోందని ఆయన తెలిపారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకపోగా, కొన్ని సంఘాల నాయకులు తమపై విమర్శలు గుప్పించడం సరైన పద్ధతి కాదన్నారు. సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి హరిప్రసాద్‌రెడ్డి, సభ్యులు నరేష్, హేమాద్రి, గౌరీశంకర్, రవికిరణ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

మన ఆత్మే పరబ్రహ్మ



మాట్లాడుతున్న సీనియర్ పిరమిడ్ మాస్టర్ గోపాలకృష్ణమూర్తి

తవణంపల్లె: ఆత్మే పరబ్రహ్మమని తద్వారా అన్ని సమకూర్చుకోవచ్చని.. నిరంతరం ధ్యాన సాధన ద్వారా ఆత్మ సాక్షాత్కారం జరుగుతుందని సీనియర్ పిరమిడ్ మాస్టర్ డాక్టర్ గోపాలకృష్ణమూర్తి తెలిపారు. ఆదివారం మండలంలోని సిద్ధంపల్లె సమీపంలోని శ్రీ విఘ్నేశ్వర మహా పిరమిడ్ శక్తిక్షేత్రంలో ఆదివారం ఆత్మజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధ్యానం ద్వారా మార్చలేనిది ఈ సృష్టిలో ఏదీ లేదన్నారు. సంతోషంగా, ఆనందంగా, ఆరోగ్యంగా జీవించడానికి ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ధ్యానం చేయాలన్నారు. సీనియర్ పిరమిడ్ మాస్టర్ బాలాజీ భగవద్గీత సారాంశాన్ని వివరించారు. కార్యక్రమంలో సంస్థ కన్వీనర్ రాధి పాల్గొన్నారు.

ప్రశాంతంగా కానిస్టేబుల్ ప్రిలిమ్స్ పరీక్ష



బంగారుపాళెంలో పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న అభ్యర్థులు

బంగారుపాళెం: మండల కేంద్రం బంగారుపాళెం పీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన పోలీస్ కానిస్టేబుల్ ప్రిలిమ్స్ పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు సీఐ నరసింహారెడ్డి, ఎస్ఐ మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష జరిగిందన్నారు. అభ్యర్థులను క్షుణ్ణంగా పరిశీలించి పరీక్షకు అనుమతించినట్లు చెప్పారు. పరీక్షకు 300 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 282 మంది హాజరయ్యారన్నారు. పరీక్ష కేంద్రాన్ని పలమనేరు డీఎస్పీ సుధాకర్‌రెడ్డి తనిఖీ చేశారు.

పూతలపట్టులో..

పూతలపట్టు: పోలీసు కానిస్టేబుల్ ప్రిలిమ్స్ పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన రాత పరీక్షకు 1000 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 902 మంది పరీక్ష రాశారు.

ట్రాక్టర్ ట్రాలీకి రిఫ్లెక్టివ్ టేప్ తప్పనిసరి

పలమనేరు : ట్రాక్టర్ ట్రాలీకి తప్పనిసరిగా రిఫ్లెక్టివ్ టేప్ అంటించాలని చెక్‌పోస్ట్ ఎంవీఐలు ఆదేశించారు. రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఆదివారం చెన్నై– బెంగళూరు హైవే పై వెళుతున్న వాహనాల డ్రైవర్లకు నిబంధనల కరపత్రాలను పంపిణీ చేశారు. ముఖ్యంగా ట్రాక్టర్లకు స్టిక్కర్లు అంటించకుంటే ప్రమాదాలు జరిగే అవకాశముంటుందని హెచ్చరించారు. ఎంవీఐలు భూషణ్‌రెడ్డి, ఆంజనేయప్రసాద్, హరికేశవ్, ఏఎంవీఐ దీపిక పాల్గొన్నారు.

‘పీపీఎస్’ సేవలు ప్రశంసనీయం

- పలమనేరు పరిరక్షణ సమితి ఆరో వార్షికోత్సవంలో వక్తలు
- పలువురికి ఉత్తమ సేవా పురస్కారాలు



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర



వివిధ రంగాల్లో సేవలు అందించిన వారికి పురస్కారం అందిస్తున్న చైర్‌పర్సన్ పవిత్ర

పలమనేరు : పట్టణంలోని సమస్యలను పరిష్కరించేందుకు అలుపెరుగని కృషి చేస్తున్న పలమనేరు పరిరక్షణ సమితి (పీపీఎస్) సభ్యుల సేవలు ప్రశంసనీయమని మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర మురళీకృష్ణ కొనియాడారు. ఆదివారం స్థానిక ఎన్‌జీఓ హోమ్‌లో సమితి ఆరో వార్షికోత్సం నిర్వహించారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ పీపీఎస్‌లో ఉద్యోగ విరమణ పొందిన వారు ఎందరో ఉన్నారని, వారు విశ్రాంతి తీసుకోకుండా ఈ వయసులో కూడా ప్రజాసేవలో నిమగ్నం కావడం అభినందనీయమన్నారు. పురపాలక సంఘంలో తన దృష్టికి వచ్చిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని, భవిష్యత్‌లోనూ పీపీఎస్‌కు అండగా నిలబడతామని వెల్లడించారు. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆకుల గజేంద్రప్రసాద్, వైఎస్సార్ చారిటబుల్ ట్రస్టు నిర్వాహకుడు కృష్ణమూర్తిరెడ్డి, గోవిందధామం ట్రస్టు నిర్వాహకులు సిద్ధయ్య, తులసీనాథం నాయుడు తదితరులు ప్రసంగించారు. అనంతరం వివిధ రంగాల్లో సేవలందించిన కాప్పల్లి రవీంద్రారెడ్డి, శ్రీధర్, జీలు, సోమచంద్రారెడ్డి, మహమూద్, జయచంద్ర, మనోహర్‌గుప్త, జయపాల్ తదితరులకు ఉత్తమ సేవాపురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్రను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సమితి అధ్యక్ష, కార్యదర్శులు సుబ్రమణ్యంపిళ్లై, నరసింహులు, ఎన్జీఓ నేత ఆనంద్‌బాబు పాల్గొన్నారు. పట్టణానికి చెందిన తాతయ్య ఈ సందర్భంగా జాతీయనాయకుల చిత్రపటాలను పలువురికి బహూకరించారు.

లోకకల్యాణమే హిందూ ధర్మం ఉద్దేశం



ఆలయంలో గజల్ శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బుజ్జిరెడ్డి, గ్రామస్తులు

ఐరాల: లోక కల్యాణం కోరుకునే ఏకైక ధర్మం హిందూధర్మమేనని సేవ్ టెంపుల్ అంబాసిడర్, గాయకుడు గజల్ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఆయన మండలంలోని పుత్రమద్దిలో వెలసిన ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయనకు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బుజ్జిరెడ్డి సాదర స్వాగతం పలికారు. అనంతరం ద్రౌపదీ సమేత ధర్మరాజుల గుడిని, నూతనంగా నిర్మిస్తున్న అభయ వీరాంజనేయ స్వామి ఆలయాన్ని గజల్ శ్రీనివాస్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయనకు అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువతలో ఆత్మ విశ్వాసం నింపే భగవద్గీత గురించి ప్రపంచానికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు.

డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి కృషి



కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న ప్రభుత్వ డ్రైవర్ల సంఘం సభ్యులు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వ డ్రైవర్ల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నామని జిల్లా ప్రభుత్వ డ్రైవర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పన్నీర్ సెల్వం అన్నారు. ఆదివారం చిత్తూరులోని ఆ సంఘం కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న డ్రైవర్ల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. విధి నిర్వహణలో ఆయా శాఖల్లోని ప్రభుత్వ డ్రైవర్లు చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని తెలిపారు. డ్రైవర్ల భద్రత, సంఘం కార్యాచరణపై చర్చించేందుకు ఈ నెల 29న సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని సంఘ సభ్యులందరూ హాజరుకావాలని కోరారు. సమావేశంలో సంఘ సభ్యులు రామన్న, షణ్ముగం, రోషన్‌భాషా, సురేష్‌బాబు, గంగాధరం, అన్నామలై, జయరాం, బాల తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీఎఫ్ డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న పర్యాటకశాఖ మంత్రి ఆర్కే రోజా

చిత్తూరు కలెక్టరేట్ : వైఎస్సార్‌టీఎఫ్ టీచర్స్ ఫెడరేషన్ ముద్రించిన డైరీని మంత్రి ఆర్కే రోజా నగరిలో ఆదివారం ఆవిష్కరించారని ఆ సంఘం రాష్ట్ర నాయకులు రెడ్డిశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్‌టీఎఫ్ ముంద్రించిన డైరీ ఆకర్షణీయంగా ఉన్నట్లు మంత్రి తెలిపారన్నారు. విద్యాభివృద్ధి కోసం నాడు–నేడు, అమ్మఒడి, జగనన్న గోరుముద్ద, విద్యా కానుక, విద్యాదీవెన లాంటి పథకాలను ప్రవేశపెట్టిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని అన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు ధనంజయరెడ్డి, జయకాంత్, కార్తీక్ రెడ్డి, జ్యోతిప్రసాద్ పాల్గొన్నట్లు తెలిపారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సత్యసాయి సేవా సమితి సభ్యులు

సత్యసేవా సమితి ఆధ్వర్యంలో..

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని శ్రీ సత్య సాయి సేవాసమితిలో ఆదివారం ఆ సమితి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం భజన కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు మధుసూదనం, సతీష్, అనిల్, ప్రసాద్, యశోద, శంకర్, గజేంద్రరెడ్డి పాల్గొన్నారు.

పాపమ్మకు జెడ్పీచైర్మన్ నివాళి



పాపమ్మ భౌతికకాయం వద్ద నివాళులు అర్పిస్తున్న జెడ్పీచైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

చిత్తూరు రూరల్ : పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అమ్మమ్మ, చిత్తూ రు మండలం పచ్చన్నపల్లికి చెందిన కే.పాపమ్మ(102)మృతి పట్ల ఆదివారం జెడ్పీచైర్మన్ శ్రీనివాసులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే పలువురు ప్రముఖులు పాపమ్మకు నివాళులర్పించారు. ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, తనయుడు ఎంఎస్ ప్రవీణ్, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.